

## కలెక్షన్ కింగ్.. కుంగ్ ఫూ పాండా 4



**పాండా** అంటే ఇష్టపడని పిల్లలు ఉండరు. ఈ చిట్టి జంతువు చేసే విన్యాసాలు పెద్దలకూ ఇష్టమే! అదే జీవి 'కుంగ్ ఫూ పాండా' సినిమాగా వచ్చి చిన్నాపెద్దలందరినీ అలరిస్తున్నది. 2008లో హాలీవుడ్ నుంచి మొదలైన 'కుంగ్ ఫూ పాండా' ఫ్రాంచైజీలో నాలుగో చిత్రం పలు దేశాల్లో ఈ నెల 8న విడుదలైంది. మొదటి ఆట నుంచే రికార్డు కలెక్షన్లు కొల్లగొడుతున్నది. రెండు రోజుల్లోనే ఏకంగా 52 మిలియన్ డాలర్ల వసూళ్లు రాబట్టింది. ఇదే ఫ్రాంచైజీలో విడుదలైన గత చిత్రాల మైలురాళ్లను దాటుకుంటూ దూసుకుపోతున్నది. 2008లో విడుదలైన మొదటి 'కుంగ్ ఫూ పాండా' ప్రపంచవ్యాప్తంగా 632 మిలియన్ డాలర్లు వసూలు చేసింది. 2011లో రిలీజైన రెండో చిత్రం 665 మిలియన్ డాలర్లు, 2016లో వచ్చిన మూడో సినిమా 521 మిలియన్ డాలర్లు రాబట్టాయి. తాజా చిత్రం ఇంతకు మించి కలెక్షన్లు చేస్తుందని ఇండస్ట్రీ టాక్. పలు దేశాల్లో ఇప్పటికే రిలీజై మంచి టాక్ తెచ్చుకున్న 'కుంగ్ ఫూ పాండా 4' ఈ నెల 15న భారత్‌లో విడుదల కానుంది.


నమస్తే తెలంగాణ

# జిందగీ

13

హైదరాబాద్ | ఆదివారం 10 మార్చి 2024 www.ntnews.com


నయా రిలీజ్

**ప్రేమకు నిర్వచనం చెప్పమని ఈ తరాన్ని అడిగితే.. చాలామంది సరైన సమాధానం చెప్పలేకపోవచ్చు. ఎందుకంటే ఆకర్షణే ప్రేమని భావిస్తున్న నేటి యువత నుంచి ఏమని జవాబు ఆశిస్తాం! మూర్ఖంగా వెంటపడి లొంగదీసుకోవడమే లవ్ అని కొన్ని సినిమాలు చూపిస్తున్నాయి. పశువులా ప్రవర్తించే పురుషుడే నిజమైన ప్రేమికుడని కొందరు దర్శకుల నిశ్చితాభిప్రాయం. విపరీత సన్నివేశాలకూ ఊగిపోతూ ఈలలు కొడుతున్న నేటి యువతీ యువకులకు నిజమైన ప్రేమంటే ఏంటని అడిగితే ఏమని చెప్పగలరు?**

## లవ్ ఈక్వేషన్ ప్రేమలు

**నటీనటులు:** నాస్లెన్ కె.గఫూర్, మాథ్యూ థామస్, మమిత బైజు, శ్యామ్ మోహన్ తదితరులు

**దర్శకత్వం:** గిరీశ్ ఎ.డి.

**విడుదల:** మార్చి 8

**ప్రేమ** పుట్టడానికి ఇరు హృదయాల్లో గొప్ప కెమికల్ రియాక్షన్ జరగాల్సిన పనిలేదు. అచ్చమైన ప్రేమ.. న్యూటన్ చర్యకు ప్రతిచర్య నియమాన్ని సంతృప్తి పర్చాల్సిన అవసరమూ లేదు. స్వచ్ఛమైన ప్రేమ చాలా సహజంగా పుడుతుంది. అసహజమైన పరిస్థితులను అతి సహజంగా మర్చిపోతుంది. ఈ మర్చిపోయే క్రమంలో కాస్త తికమకలు ఉంటాయి. బెట్టు చేయడాలూ ఉంటాయి. ప్రేయసి తన పట్టు తప్పుతుందన్న ఆందోళన ప్రేమికుడ్ని నరకంలో కూలదోస్తుంది. అతను ఇచ్చే చిన్న మెచ్చుకోలు ఆమెను ఎవరెస్ట్ శిఖరంపై కూర్చోబెడుతుంది. ఈ ప్రేమను అర్థం చేసుకోలేక, ఎదుటివ్యక్తి తనపై చూపుతున్న అభిమానం లోతు అంచనా వేయలేక అగాథం వైపు నడిచేవాళ్లు ఎందరో! కానీ, ఆ మనసులో తనకెంత గొప్పస్థానం ఉందో తెలిశాక.. ఈ మనిషి కండ్లు చెమ్మగిల్లకుండా ఉండగలవా?

ఇలాంటి ఓ సహజమైన ప్రేమ కథే.. 'ప్రేమలు'. మాలీవుడ్‌లో గతనెల విడుదలై తిరుగులేని విజయాన్ని సొంతం చేసుకున్న ఈ చిత్రం అదే పేరుతో తెలుగులో రిలీజైంది. మౌత్ పబ్లిసిటీతో తెలుగునాట హౌజ్‌ఫుల్ కలెక్షన్లు సాధిస్తున్నది. కథలోకి వెళ్తే.. సచిన్ సంతోష్ (నాస్లెన్ కె.గఫూర్) బీటెక్ పూర్తి చేసి ఖాళీగా ఉంటాడు. పై చదువుల కోసం యూకే వెళ్లాలనుకుంటాడు. వీసా రిజెక్ట్ కావడంతో తన స్నేహితుడు అమూల్ డేవిస్ (సంగీత్ ప్రతాప్)తో కలిసి హైదరాబాద్‌కు వస్తాడు. గేట్ కోచింగ్‌లో జాయిన్ అవుతాడు. రీనూ (మమిత బైజు) సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిగా పని చేస్తుంటుంది. కామన్ ఫ్రెండ్ పెండ్లిలో సచిన్, రీనూ కలుసుకుంటారు. తొలి చూపులోనే రీనూను ప్రేమిస్తాడు సచిన్. రీనూ ఆఫీస్‌లో టీమ్‌లీడర్‌గా ఉన్న ఆది (శ్యామ్ మోహన్) ఆమెను ఇష్టపడుతుంటాడు. రోజులు గడిచేకొద్దీ రీనూ, సచిన్ మధ్య స్నేహం పెరుగుతుంది. ఓ రోజు సచిన్ రీనూతో తన మనసులో మాట చెబుతాడు. దానికి ఆమె ఏమంది? సచిన్, రీనూ ప్రేమ కథ ఎలా ముగిసింది అన్నది మిగిలిన కథ!



స్టోరీలైన్ చిన్నదే! రొటీన్‌గా విన్నదే! కానీ, దాన్ని దర్శకుడు గిరీశ్ తెరకెక్కించిన విధానం అద్భుతంగా పండింది. దీనికి తోడు తెలుగు డబ్బింగ్ వెర్షన్‌లో '#90's' దర్శకుడు ఆదిత్య హాసన్ రాసిన మాటలు 'ప్రేమలు'లో నవ్వులు పండిస్తాయి. మీమ్స్ లాంగ్వేజ్ డైలాగులు ఈ తరానికి బాగా కనెక్ట్ అవుతాయి. స్టార్టప్ కల్చర్, యావరేజ్ స్టూడెంట్ యాటిట్యూడ్, ఈ తరం అమ్మాయిల అత్యాశలు ఇవన్నీ 'ప్రేమలు' చిత్రాన్ని యూత్ ఎంటర్‌టైనర్‌గా నిలబెట్టాయి. పతాక సన్నివేశాల్లో పండిన భావోద్వేగాలు ప్రేక్షకుడికి రిలీఫ్ ఇస్తాయి. ఫీల్ గుడ్ మూవీ చూసిన అనుభూతి కలుగుతుంది. చివరిగా.. ఫాంటసీ ప్రేమల్లో కొట్టుమిట్టాడుతున్న వాళ్లు... 'ప్రేమలు' చూశాక, గతంలో తమ హృదయాన్ని తాకిన నిజమైన ప్రేమను తలచుకోకుండా ఉండలేరు!





# నాయిక.. ఏలిక అయ్యేనా?!

**'కథానాయిక'.. ఈ స్థానానికి ఇప్పుడు విలువ ఉందా? ప్రస్తుత సినిమాల్లో హీరోల పక్కన కనిపిస్తూ, వాళ్లను ప్రేమిస్తూ.. కవ్విస్తూ.. కలిసి స్టెప్పులేస్తూ.. మధ్యమధ్యలో తళుక్కున మెరిసి మాయమవుతున్న అందాలను.. అలవాటులో పొరపాటుగా హీరోయిన్స్ అనేస్తున్నాం గానీ.. నిజానికి అలా పిలిపించుకునే స్థాయి.. అనిపించుకునే అర్హత ఈ పాత్రలకు ఉన్నాయా? ప్రస్తుతం వెండితెర కథానాయిక అంపశయ్య మీద ఉన్నది. కొడిగట్టిన దీపంలా నేడో రేపో కొండెక్కటానికి సిద్ధంగా ఉన్నది. దేనికీ పరిస్థితి?. ఎవరిదీ పాపం?**

**'పాతాళ భైరవి'** సినిమాలో నేపాల మాంత్రికుడైన ఎస్వీ యార్ అంటాడు.. 'జనం మెచ్చింది మనం శాయవలెనా.. మనం చేసింది జనం చూడవలెనా..' అని. 'జనం మెచ్చిందే మనం చేయాలి దేవరా..' అంటాడు సదాజపుడిగా ఉన్న పద్మనాభం. నేటి సినీ పరిశ్రమకు వేదం లాంటి డైలాగ్ ఇది. సినిమా వ్యాపార మాధ్యమం కనుక కచ్చితంగా జనం మెచ్చిందే చెయ్యాలి.. తప్పులేదు.. తప్పదు. కానీ, ఈ ప్రక్రియ వల్ల తెరపై విలువలు, వలువలు రెండూ మాయమయ్యాయి. కథానాయిక అయితే అనారోగ్యానికి గురైంది.. ఇది నిజం.

**'పాతాళ భైరవి'** సినిమాతో పుట్టిన 'హీరోయిజం' అనే వైరస్.. సినీ పరిశ్రమమొత్తం వ్యాపించి కథల్ని ప్రభావితం చేసింది. అది కొన్నేళ్లపాటు నివురుగప్పిన నిప్పులా ఉండి, 'అడవి రాముడు'తో దావానలంగా మారింది. ఇక సినిమాకు హీరోనే సర్వాంతర్యామిగా మారాడు. దర్శకనిర్మాతలకు హీరోల భజనలు, బిల్డప్పులే తారక మంత్రాలయ్యాయి. 'ట్రెండ్' అనే బూచికి రచయితలు కూడా వత్తాసు పలికారు. ఫలితం మంచి కథలు మరుగున పడ్డాయి. కథానాయిక మంచం పట్టింది. తాము మెచ్చింది జనానికి నచ్చేలా చూపించేంత ప్రతిభావంతులైన దర్శకులు కనుమరుగవ్వడం కూడా ఈ పరిస్థితికి కారణం అని చెప్పొచ్చు. బి.ఎన్.రెడ్డి, కె.వి.రెడ్డి, ఎల్వీ ప్రసాద్, కమలాకర కామేశ్వరరావు, ఆదుర్తి సుబ్బారావు, కె.విశ్వనాథ్, కె.బాలచందర్, బాపు.. వీరంతా ట్రెండ్‌ని సెట్ చేశారు తప్ప అనుసరించలేదు. అందుకే వారి నుంచి అద్భుతాలు, ఆణిముత్యాలు వచ్చాయి. హీరోలతో సమానంగా హీరోయిన్లు కూడా ఓ వెలుగు వెలిగారు. ఆ ప్రభను కాసేపు గుర్తుచేసుకుందాం.

**ఫలానా** హీరో సరసన ఫలానా హీరోయిన్ నటించిందని మాట్లాడుకోవడం, రాయడం పరిపాటే. అయితే.. ఆత్మాభిమానానికి, అభిజాత్యానికి ప్రతీకగా నిలిచిన మహానటి, బహుముఖ ప్రజ్ఞాశాలి భానుమతి రామకృష్ణ నటించిన చండీరాణి, విప్రనారాయణ, చింతామణి, చక్రపాణి.. ఇలా ఎన్నో చిత్రాల్లో ఆమె సరసన ఎన్టీయార్, ఏఎన్నార్ నటించారంటే కాదనగలమా?!.

**స్వప్నసుందరి,** సువర్ణసుందరి, చెంచులక్ష్మి, ఇలవేల్పు.. ఇవన్నీ హీరోయిన్ ఓరియెంటెడ్ సినిమాలే. మరి వీటన్నిటిలో అంజలిదేవి సరసన అక్కినేని నటించారంటే తప్పేం కాదే! మహానటి సావిత్రి నటించిన సిరిసంపదలు, దేవత, సుమంగళి, చదువుకున్న అమ్మాయిలు, ఆరాధన, మాతృదేవత.. ఈ సినిమాలన్నీ స్త్రీ ప్రాధాన్య చిత్రాలే కదా! వీటిల్లో సావిత్రికి జోడీగా ఎన్టీయార్, ఏఎన్నార్ నటించారు.. ఔనా కాదా?

ఆదుర్తి సుబ్బారావు దర్శకత్వంలో వచ్చిన క్లాసిక్ 'తోడికోడళ్లు' సినిమాలో అక్కినేని ఓ పాత్రధారి మాత్రమే. కన్నాంబ, సూర్యకాంతం, సావిత్రి ఇందులో ప్రధాన పాత్రధారులు. అయినా ఆ సినిమాకు అప్పటి ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. తమిళనాట 'యంగళ్‌వీట్టు మహలక్ష్మి' పేరుతో విడుదలై అక్కడ కూడా ఘన విజయాన్ని అందుకుందీ సినిమా. అప్పటి ప్రేక్షకులు హీరోయిన్లకు ఇచ్చిన విలువ అదీ.



### సినిమా పేరే ఇంటిపేరు...

**1950లో** విజయావారు 'షావుకారు' అనే సినిమా తీశారు. ఆ సినిమా టైటిల్ రోల్ చేసింది గోవిందరాజుల సుబ్బారావు. అప్పటికే ఆయన పెద్ద స్టార్. అందులో యువ జంటగా ఎన్టీయార్, షావుకారు జానకి నటించారు. జానకికి అదే తొలి సినిమాకాగా, ఎన్టీయార్‌కు సోలో హీరోగా తొలి సినిమా. అప్పటివరకూ రెండుమూడు సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు చేసిన ఎస్వీ రంగారావు, 'షావుకారు'లో సున్నపు రంగడిగా ప్రాధాన్యమున్న పాత్ర చేశారు. ఇప్పుడు ఇదంతా దేనికి? అంటే.. చందమామ కథల పుస్తకం కూడా విజయావారిదే కావడం చేత, అప్పట్లో 'షావుకారు' సినిమా ప్రకటనను ఆ పుస్తకం వెనుక భాగంలో ముద్రించారు. ఆ ప్రకటనలో గోవిందరాజుల సుబ్బారావుగానీ, ఎన్టీయార్‌గానీ కనిపించరు. ఒక్క షావుకారు జానకి మాత్రమే ఉంటారు. అది ఆమె తొలి సినిమా అయినా.. అప్పటి తరంవాళ్లు కథానాయికకు ఇచ్చిన విలువ అది. అందుకు తగ్గట్టే తర్వాత కాలంలో ఆ సినిమా పేరునే ఇంటిపేరుగా మార్చుకొని, శంకరమంచి జానకి కాస్తా.. 'షావుకారు' జానకిగా మారిపోయారు.

**ఐకానిక్** క్యారెక్టర్లతో భారతీయ సినీ చరిత్రలో ఏ హీరోయిన్లూ సాధించలేని క్రెడిట్‌ను సాధించారు మన నాయికలు. వెండితెర సీతమ్మ అంటే.. అంజలీదేవే గుర్తొస్తారు. ద్రౌపది అంటే కళ్లముందు కదిలే రూపం.. మహానటి సావిత్రి. సత్యభామ అనగానే తళుక్కున మెరిసే రూపం.. జమున, ఆదిపరాశక్తిగా కేఆర్ విజయ రూపాన్ని మర్చిపోగలమా!.. సాంఘిక పాత్రలే కాదు, పౌరాణిక పాత్రలతోనూ ఓ బెంచ్ మార్క్‌ను సెట్ చేశారు మన హీరోయిన్లు. జయలలిత, వాణిశ్రీ, శారద, జయసుధ, శ్రీదేవి, జయప్రద, రాధిక, విజయశాంతి, సౌందర్య.. ఓ విధంగా స్వర్ణయుగాన్ని చవిచూసిన కథానాయికలు వీరు.

**వీరిలో** శ్రీదేవి మినహా ఎవరూ 'పద్మశ్రీ'లు కారు. సావిత్రి బయోపిక్‌లో సావిత్రి పాత్ర పోషించిన కీర్తి సురేశ్ జాతీయ ఉత్తమనటి అయ్యారు కానీ, సావిత్రి మాత్రం ఇప్పటివరకూ 'పద్మశ్రీ' కాలేకపోయారు. భావదారిద్ర్యానికి పరాకాష్ట ఇది. కానీ, జనం సావిత్రికి ఇచ్చిన బిరుదు.. 'మహానటి'. అప్పటి కథానాయిక పరిస్థితి అలా ఉంటే.. నేటి కథానాయిక పరిస్థితి అధ్వాన్నం. అప్పుడప్పుడే 'అరుంధతి', 'ఓ బేబీ', 'గీత గోవిందం' లాంటి మెరుపులు. మిగతా అంతా గ్లామర్ షోలే. ఇప్పుడు కథానాయిక అంటే.. హీరోల పక్కన తైతక్కలాడే ఆట బొమ్మ. సరైన కథలు తీసే దర్శకులు, రాసే రచయితలు, అభిరుచి గల నిర్మాతలు లేకపోవడమే ఈ పరిస్థితికి కారణం.

**సమాజంలో** కోటానుకోట్ల జీవితాలు. ఆ జీవితాల నుంచే కథలు పుడతాయి. ఆ కథల నుంచే మంచి పాత్రలు ఉత్పన్నమవుతాయి. ఉదాహరణగా మహాభారతాన్ని తీసుకుంటే.. అది ఓ సమాజం. ఇందులో ఒక్కొక్కరిదీ ఒక్కో కథ. ఎవరి కథకు వాళ్లు హీరో. ప్రతి కథలో హీరోయిన్ కామన్. అన్ని కథలూ ఏదోఒక నీతిని చెబుతాయి. అందుకే అది పంచమవేదం అయ్యింది. రచయితలకు అంతకు మించిన రిఫరెన్స్ మరొకటి ఉండదు. కానీ, రొడ్డకొట్టుడు కథలే వాళ్లు రాస్తారు.. వీళ్లు తీస్తారు. చివరిగా చెప్పొచ్చేదేంటంటే.. ఒకప్పుడు హీరోహీరోయిన్లు సమానం.. కొన్నాళ్ల తర్వాత హీరో కాస్త ఎక్కువ సమానం.. ఇప్పుడు హీరోనే సర్వాంతర్యామి.. మరి హీరోయిన్‌కు మంచిరోజులెప్పుడో?! కథానాయిక.. సినిమా ఏలిక అయ్యేదెన్నడో?!

... బుర్రా నరసింహ

## ప్రపోజ్ చేయగానే.. పారిపోయాడు



**బాలీవుడ్** వెండితెరపై హిట్ పెయిర్ శ్రద్ధాకపూర్, వరుణ్ ధావన్. వీళ్లిద్దరికీ చిన్నప్పటి నుంచి అనుబంధం ఉంది. ఒకే స్కూల్‌లో చదివారు కూడా! ఈ ఇద్దరి సాన్నిహిత్యం చూసి ఎప్పటికైనా జట్టుకడతారనే వార్తలూ చాలాసార్లు వినిపించాయి. అయితే వరుణ్ తన స్నేహితురాలు నటాషా దలాల్‌ను పెండ్లి చేసుకోవడంతో ఈ పుకార్లకు తెరపడింది. అయితే, ఇటీవల ఒక ఇంటర్వ్యూలో వరుణ్‌కు తాను ప్రపోజ్ చేశానంటూ శ్రద్ధా చేసిన కామెంట్లు వైరల్ అయ్యాయి. ఇంతకీ ఆమె ఆ ఇంటర్వ్యూలో ఏం చెప్పిందంటే.. 'చిన్నప్పటి నుంచి వరుణ్ నా బెస్ట్ ఫ్రెండ్. అతణ్ని బాగా ఇష్టపడేదాన్ని. ఓ రోజు నేరుగా తనకు ప్రపోజ్ చేశాను. వెంటనే పరుగు లంఘించుకున్నాడు. అప్పుడు నా వయసు ఎంతనుకున్నారు? జస్ట్ ఎనిమిదేండ్లే! 'యూ.. లవ్.. ఐ' అనగానే వరుణ్‌కు ఏం చెప్పాలో తెలియక 'నో..' అని పారిపోయాడు పాపం' అంటూ చిన్ననాటి జ్ఞాపకాన్ని నెమరువేసుకుంది.

## మళ్లీ భయపెట్టేందుకేనా?

**ఇప్పుడంతా** ఫ్రాంచైజీ సినిమాల జమానానే! ఒక సినిమా ఘన విజయం సాధిస్తే.. అయితే సీక్వెల్‌తో ఆ సక్సెస్‌ను కొనసాగిస్తున్నారు. అందుకు అవకాశం లేకపోతే ఫ్రాంచైజీ ఫార్ములాను ఎంచుకుంటున్నారు దర్శక, నిర్మాతలు. 'చంద్రముఖి' సినిమాకు రీమేక్ వెర్షన్‌గా బాలీవుడ్ ప్రేక్షకులను అలరించిన సినిమా 'భూల్ భులయ్యా'. 2007లో విడుదలైన ఈ సినిమాలో అక్షయ్ కుమార్, విద్యాబాలన్ ప్రధాన పాత్రలు పోషించారు. 'చంద్రముఖి' డైరెక్టర్ ప్రియదర్శన్ ఈ సినిమాకు దర్శకత్వం వహించాడు. ఈ చిత్రానికి ఫ్రాంచైజీ హోదా కట్టబెట్టి 15 ఏండ్ల తర్వాత అనీస్ బజ్మీ దర్శకత్వంలో 'భూల్ భులయ్యా 2' విడుదలైంది. టబు, కార్తిక్ ఆర్యన్, కియారా అద్వాణి నటించిన ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర మంచి కలెక్షన్లు రాబట్టింది. రెండో సినిమా కూడా హిట్ కావడంతో మూడో ప్రయత్నానికి ముహూర్తం కుదిరింది. ఇందులో కార్తిక్ ఆర్యన్ హీరోగా నటిస్తున్నాడు. మాధురీ దీక్షిత్, విద్యాబాలన్ ఈ ప్రాజెక్టులో భాగమవ్వడంతో సెట్స్‌కు చేరకముందే దీనిపై భారీగా అంచనాలు నెలకొన్నాయి. నవంబర్‌లో సినిమాను విడుదల చేస్తామని ప్రొడక్షన్ టీమ్ చెబుతున్నది. 'భూల్ భులయ్యా 3' ప్రేక్షకులను ఎంతలా అలరిస్తుందో చూడాలి!



